
సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 28 । మార్చి । 2023



1న అప్పన్న కల్యాణం
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను ఏప్రిల్ 1 నుంచి 7 వరకు నిర్వహించనున్నారు. 8లో



ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ రెడీ
జీ-20 సదస్సుకు విచ్చేసే విదేశీ అతిథులను ఆకట్టుకోవడానికి ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ముస్తాబైంది. 8లో



ప్రతిభ చూపితేనే ప్రవేశం
వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఈ ఏడాది సరికొత్త విధానం అమల్లోకి తెచ్చారు. 10లో



న్యూస్‌రీల్

ఆధునికీకరించిన ఏయూ బస్టాప్ ప్రారంభం



బస్టాప్ ప్రారంభోత్సవంలో మంత్రులు సురేష్, అమర్‌నాథ్, తదితరులు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఆంధ్ర యూనివర్సిటీ ఇన్ గేట్ వద్ద రూ.19 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన బస్టాప్‌ను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జీ-20 సదస్సుకు వచ్చే అతిథులు మెచ్చేలా నగర సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఏయూ ఇన్‌గేటు వద్ద ఉన్న బస్టాప్‌ను ఆధునికీకరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మీ, సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, ఏయూ వీసీ ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌సీ శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: జిల్లాలో ఏప్రిల్ 1, 2 తేదీల్లో యూపీఎస్‌సీ నిర్వహిస్తున్న కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ ఆదివారం ప్రధాన కార్యాలయాలకు చేరిందని చెప్పారు. విశాఖలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏవీఎన్ కళాశాలల్లో రెండు రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించబోమని, సిబ్బంది కూడా తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు. పరీక్షలు ఆఫ్‌లైన్‌లో జరుగుతున్నందున పరీక్షా కేంద్రాల్లో బందోబస్తు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్యసదుపాయం వంటి వాటిని ఆయా శాఖాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏవీఎన్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.ఎస్.శోభారాణి, ఎస్.హెచ్.ఎం.సింహాద్రినాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ కె.వెంకటరావు, తపాలా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఈపీడీసీఎల్, జీవీఎంసీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆరిలోవ(విశాఖ తూర్పు): బీఆర్‌టీఎస్ రోడ్డులో రవాణా వాహనాలను ట్రాన్స్‌పోర్టు అధికారులు సోమవారం తనిఖీ చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో హనుమంతవాక నుంచి పైనాపిల్ కాలనీ మీదుగా ప్రయాణించే రవాణా వాహనాలను తనిఖీ చేశారు. వాహనాల్లో నిషేధిత వస్తువులేమైనా ఉన్నాయోమోనని పరిశీలించారు. పరిమితిని మించి లోడు తరలిస్తున్న వాహనాల డ్రైవర్లకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ జీ-20 సదస్సు సందర్భంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాలకు ప్రభుత్వం ఇచ్చిన నంబరు ప్లేట్లు అమర్చాలని సూచించారు.

బకాయిలు చెల్లించండి.. వడ్డీ మాఫీ పొందండి

దాబాగార్డెన్స్: ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఒకే సారి చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 34 విడుదల చేసిందని తెలిపారు. పన్ను బకాయి ఉన్న మొత్తాన్ని ఒకే సారి ఈ నెల 31లోపు చెల్లించినట్టయితేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందన్నారు. పన్నులను ఆన్‌లైన్ ద్వారా https://cdma.ap.gov.in గానీ, నెట్-బ్యాంకింగ్ ద్వారా గానీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా గానీ, యూపీఐ ద్వారా కానీ చెల్లించవచ్చని పేర్కొన్నారు.



జీ20 ప్రతినిధులకు ఫ్లవర్‌ఫుల్ స్వాగతం



వెల్‌కమ్ టు వైజాగ్



సిటీ లుక్ : విద్యుత్ కాంతుల్లో సుందర నగరం

- జీ-20 సదస్సుకు ప్రపంచ దేశాల ప్రతినిధులకు ఆహ్వానం
- నేటి నుంచి వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్ థీమ్‌తో జీ20 సదస్సు
- ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహణ
- రూ.157 కోట్లతో సర్వాంగ సుందరంగా విశాఖ ముస్తాబు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. రోడ్లు మెరిసిపోతున్నాయి.. రోడ్ల మధ్య ఉన్న డివైడర్లు పచ్చని మొక్కలతో అలరిస్తున్నాయి.. రోడ్డుకు ఇరువైపులా గోడలపై తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళారూపాలు ఆకర్షిస్తున్నాయి. జంక్షన్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లు విభిన్నంగా ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి. కైలాసగిరి, సీతకొండల రాళ్లపై చిత్రాలు ప్రతి ఒక్కరినీ కట్టి పడేస్తున్నాయి. పర్యాటక ప్రాంతాలు మరింత అందంగా ముస్తాబయ్యాయి. కొత్త బీచ్‌లతో పాటు ఐలవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ వంటివి పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. ఇలా సిటీ ఆఫ్ డెస్టినీ మరో అంతర్జాతీయ సదస్సుకు సన్నద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ-20 సదస్సుకు సాగర తీరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్ మరింత పెంచేలా.. దేశం గర్వించేలా సదస్సును విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరం మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చే అతిరథ మహారథులందరినీ కట్టిపడేసేలా రూ.157 కోట్లతో నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది.

తొలిసారి అవకాశం

విశాఖ అనేక అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు వేదికగా నిలుస్తోంది. తాజాగా ప్రతిష్టాత్మక జీ20 సదస్సుకు ఆతిథ్యమిస్తోంది. ఇటీవలే దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ గ్రాండ్ సక్సెస్ అయింది. దిగ్గజ పారిశ్రామికవేత్తలు విశాఖలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వనరులను ప్రపంచ దేశాలకు తెలియజెప్పారు. తాజాగా జీ-20 సదస్సు కోసం విదేశాల నుంచి ప్రతినిధులు విశాఖకు వస్తున్నారు. 'వన్ ఎర్త్.. వన్ ఫ్యామిలీ.. వన్ ఫ్యూచర్' అనే థీమ్‌తో రాడిసన్ బ్లూ బీచ్ రిసార్ట్‌లో జీ-20 సదస్సు జరగనుంది. ఇప్పటికే 57 మంది ప్రతినిధులు విశాఖకు చేరుకున్నారు. తొలి రోజు మూడు విభిన్న అంశాలపై సమావేశాలు జరగనున్నాయి. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ సదస్సును ప్రారంభించనున్నారు. సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సదస్సుకు హాజరవుతున్నారు. వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నారు. రెండో రోజు 29వ తేదీన మౌలిక సదుపాయాల కల్పన అంశంపైన, మూడో రోజు 30న కెపాసిటీ బిల్డింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

జీ-20 సదస్సుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. 2,500 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కటుదిట్టమైన బందోబస్తు కల్పిస్తోంది. ఇందులో 1,850 మంది సివిల్ పోలీసులు, 400 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్, 4 గ్రే హౌండ్స్ దళాలు, 2 క్యూఆర్టీ టీమ్స్, 6 ప్రత్యేక పార్టీలు, 2 ఏపీఎస్పీ ప్లాటూన్లను మోహరిస్తున్నారు. ప్రతినిధుల భద్రతా చర్యల్లో భాగంగా ఆరు ప్రాంతాలను రెడ్ జోన్లుగా పోలీసులు ప్రకటించారు. రాడిసన్ బ్లూ రిసార్ట్, ఆర్కే బీచ్ రోడ్, కైలాసగిరి, ముడసర్లోవ పార్క్, జిందాల్ ఎనర్జీ ప్లాంట్, స్కాడా మాధవధార ప్రాంతాలకు రెండు కిలోమీటర్ల పరిధిలో 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు డ్రోన్ల ఎగరవేతపై పోలీసులు నిషేధం విధించారు. ఇప్పటికే విదేశీ ప్రతినిధులు పర్యటించే ప్రాంతాల్లోను, వారు బస చేసే హోటల్ వద్ద బాంబ్, స్నిఫర్‌డాగ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కటుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన అభివృద్ధి పనులు

రోడ్ల అభివృద్ధి	46 కిలోమీటర్లు
పెయింటింగ్ పనులు	24 కిలోమీటర్లు
ఫుట్‌పాత్‌ల నిర్మాణం	10 కిలోమీటర్లు

ఏమేమి చేశారంటే..

- సీతకొండపై బీచ్ వైఎస్సార్ వ్యూ పాయింట్ ఆధునికీకరణ
- ఐ లవ్ వైజాగ్ సెల్ఫీ పాయింట్, సోలార్ ట్రీ ఏర్పాటు
- సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం బీచ్‌ల అభివృద్ధి
- కైలాసగిరి రోప్‌వే నుంచి తిమ్మాపురం వరకు ఫుట్‌పాత్‌లకు టెర్రాకోట్
- రోడ్లకు ఇరువైపులా వెదురు ఆకృతులపై పూలమొక్కలు
- విద్యుత్ స్తంభాలకు వెరైటీ సొగసులు



శిలలపై చిత్రాలు : సీతకొండ వ్యూ పాయింట్ వద్ద అందమైన పెయింటింగ్స్

నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక

- జీ20 సదస్సుకు హాజరు
- గాలా డిన్నర్‌లో పాల్గొననున్న సీఎం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు రానున్నారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభం కానున్న జీ-20 సదస్సుకు హాజరుకానున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సాయంత్రం 5.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రుషికొండలో గల రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకుంటారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు జీ-20 సదస్సుకు వచ్చే 20 దేశాల ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అనంతరం జరిగే 'గాలా డిన్నర్'లో పాల్గొని విదేశీ అతిథులకు ఆతిథ్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా సదస్సునుద్దేశించి సీఎం మాట్లాడనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్స్ నుంచి బయలు దేరి 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి విమానంలో గన్నవరం వెళ్తారు.



వావ్ : చెట్లు..పువ్వులు..వెలుగులు



పువ్వుల్..నవ్వుల్ : వెదురుతో కళాకృతులు



అదరహో : జీ -20 సదస్సులో పాల్గొనే దేశాల చిహ్నాలతో హోర్డింగులు

ఫుడ్ కియోస్క్‌లు వచ్చేస్తున్నాయ్

- రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక
- తొలి విడతలో 100 పర్యాటక ప్రాంతాల్లో కియోస్క్‌లు
- విభిన్నమైన స్నాక్స్ అందుబాటులోకి తీసుకొచ్చేలా డిజైన్‌లు
- నిరుద్యోగ యువతకు వ్యాపార అవకాశాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని పర్యాటక అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీ టీడీసీ) సరికొత్త ఆలోచనలతో అడుగులు వేస్తోంది. పర్యాటకులకు ప్యాక్ చేసిన రుచికరమైన భోజనం, స్నాక్స్ అందించేందుకు 'అమృత్ కియోస్క్'లను తీసుకొస్తోంది. రాష్ట్రం మొత్తం తొలి విడతలో 100 కియోస్క్‌లు ఏర్పాటు చేయనుంది. తద్వారా నిరుద్యోగ యువతకు వ్యాపార అవకాశాలు కల్పించడమే కాకుండా పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఆహారం నుంచి కూల్‌డ్రింక్స్ వరకూ..

అమృత్ కియోస్క్‌లను రెండు భాగాలుగా నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించారు. మైల్డ్ స్టీల్ (ఎంఎస్) వేరియంట్, ఫైబర్ రీన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ (ఎఫ్ఆర్‌పీ) వేరియంట్‌గా వీటిని డిజైన్ చేయనున్నారు. ఎంఎస్ వేరియంట్‌లో మూడు వైపులా టఫ్నెడ్ గ్లాస్ ఏర్పాటు చేసి.. అందులో ఎగ్జాస్ట్ ఫ్యాన్, సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్స్, ఫ్రంట్ డిస్‌ప్లే బోర్డు, వాటర్, విద్యుత్ సరఫరాకు అనుగుణంగా నిర్మించనున్నారు. ఎఫ్ఆర్‌పీ వేరియంట్‌లోనే స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటెమ్స్ ప్రిపేర్ చేసేందుకు అవసరమైన నిర్మాణాలు, పరికరాలుంటాయి. 15 ప్రీసెట్ మెనూతో నడిచే ఆటోమేటిక్ ఫ్రయ్యర్, మిల్క్‌షేక్ మెషినరీ, మోమో స్టీమర్, హాట్ గ్రిల్ ప్లేట్‌తో పాటు వర్టికల్ ఫ్రీజర్, 23 లీటర్ల సోలో ఓవెన్, 12 లీటర్ల ఆయిల్ సామర్థ్యం గల ట్యాంక్, ఫ్రెంచ్ ఫ్రైస్ కట్టర్, స్టాక్ బౌల్స్, స్క్వీజ్ బాటిల్, లిమన్ స్క్వీజర్, మాండోలిన్ వెజ్ కట్టర్, సూప్ చేసే బౌల్, డస్ట్ బిన్ మొదలైనవి ఉంటాయి. టూరిస్టులకు కావల్సిన కూల్ డ్రింక్స్ కూడా సర్వ్ చేసేలా ఈ కియోస్క్‌లో ఏర్పాటు చేయనున్నారు.

సీఎం మార్గదర్శకాల నేపథ్యంలో..

'భారత్‌లో అడుగుపెట్టే ప్రతి పర్యాటకుడు రాజస్థాన్ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకుంటున్నారు. అక్కడి పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ సదుపాయాలు ఉండటమే దీనికి కారణం. పర్యాటకంగా ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలో ప్రముఖ స్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలి. ఆతిథ్యం, పర్యాటక రంగాల్లో పేరు ప్రఖ్యాతలున్న సంస్థలు హోటళ్లను ఏర్పాటు చేసేలా ఉత్తమ సదుపాయాలు కల్పించాలి. దీనివల్ల రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలపై అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రచారం లభిస్తుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యాటక శాఖ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కొత్త విధానాలపై దృష్టి సారించింది.

రాష్ట్రానికి వచ్చే పర్యాటకులు ఆహారం విషయంలో ఇబ్బందులు పడకుండా కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమృత్ కియోస్క్‌ల పేరుతో ఫ్రాంచైజీ మోడ్‌లో కో-బ్రాండ్ భాగస్వామి ద్వారా ప్యాక్ చేసిన ఆహారం, స్నాక్స్, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ వంటి వాటిని పరిశుభ్రంగా టూరిస్టులకు అందించనున్నారు.



లబ్ధిదారులకు తర్ఫీదు



అమృత్ కియోస్క్‌ల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఏపీ టీడీసీ చేపట్టనుంది. ఎంపికైన వారికి కియోస్క్‌ల నిర్వహణపై శిక్షణ అందించనున్నారు. భద్రత, కార్యకలాపాల నిర్వహణ, ఉత్పత్తుల నాణ్యత, ప్యాకేజింగ్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుంది. అదేవిధంగా లబ్ధిదారులకు ఫుడ్ తయారీకి అవసరమైన పిండి, సాస్, వండటానికి సిద్ధంగా ఉన్న వస్తువులు, ప్రీ మిక్స్‌లు, వెజ్ ఐటెమ్స్ మొదలైన ముడి పదార్థాలు, డ్రింక్స్, స్మూతీలు, మాక్‌టైల్స్, జ్యూస్‌లు మొదలైనవి సరఫరా చేస్తారు. ఈ కియోస్క్‌ల్లో తయారు చేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కూడా పర్యాటక శాఖ బాధ్యత తీసుకుంటుంది. అమృత్ కియోస్క్‌ల వైపు సందర్శకులు ఆకర్షితులయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. కొనుగోలు వ్యవహారాలు పెరిగేలా స్థానిక ఇతర వ్యాపారాలు, ఈవెంట్స్ నిర్వాహకులు, స్థానిక బేకరీలతో టైఅప్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. ఎంపిక చేసిన ఏజెన్సీ ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. త్వరలోనే వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పర్యాటక శాఖ వడివడిగా అడుగులు వేస్తోంది.

ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి


- రాష్ట్ర పారిశ్రామిక విధానమే కారణం
- కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్ భేటీ



కొరియా ప్రతినిధులతో మంత్రి అమర్‌నాథ్

మహారాణిపేట : భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న వ్యాపార సంస్థలు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకుంటున్నాయని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పారిశ్రామిక వేత్తలను ఆకర్షించే విధంగా రాష్ట్రంలో పారిశ్రామిక విధానం అమల్లో చేస్తున్నామన్నారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఏపీని ఎంచుకుంటున్నారని చెప్పారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో కొరియా అధికారుల ప్రతినిధుల బృందం సోమవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మంత్రి అమర్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుంది. విశాఖపట్నంలో ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు అంశంపై చర్చించామని తెలిపారు. వర్తక వాణిజ్యరంగంలో ఆంధ్రప్రదేశ్ సౌత్ ఏషియాకు ముఖ ద్వారంగా నిలిచిందని మంత్రి అమర్‌నాథ్ కొరియా బృందానికి వివరించారు. ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలు మరింత బలపడాలని మంత్రి అమర్‌నాథ్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

జీ-20 అక్షర ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన



ఆనందపురం : మండంలోని తర్లువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీ-20 అక్షరాల ఆకృతిలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మూడు రంగుల జెండాలను చేతబట్టి విద్యార్థులు ప్రదర్శనిచ్చారు. సుమారు 180 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

నర్సులకు పదోన్నతి కౌన్సెలింగ్

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ జోన్-1లో నర్సింగ్ గ్రేడ్-2 పోస్టులకు సోమవారం రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి కౌన్సెలింగ్ నిర్వహించారు. మూడు పోస్టులకు డీపీసీ ద్వారా ఎంపిక చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(శ్రీకాకుళం)లో హెడ్ నర్సుగా పని చేస్తున్న పి.కామేశ్వరికి ఈఎన్‌టీ ఆస్పత్రిలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, కేజీహెచ్ హెడ్ నర్సుగా పని చేస్తున్న ఎల్.అమ్మన్నను విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. విశాఖపట్నం ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలో పని చేస్తున్న ఒ.పి.ఎల్.కుమారిని శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా నియమించినట్టు ఉమాసుందరి తెలిపారు.

1 నుంచి అప్పన్న వార్షిక కల్యాణ మహోత్సవాలు

- 2న రథోత్సవం
- సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు వెల్లడి



సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను ఏప్రిల్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సోమవారం తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 7గంటల నుంచి రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం, మృత్సం గ్రహణం, అంకురార్పణలతో వార్షిక కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నామన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కొట్నాల ఉత్సవం, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు ఆరాధన, విశేష హోమాలు, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు ఎదురు సన్నాహోత్సవం, రాత్రి 8 నుంచి 9గంటల వరకు రథోత్సవం, రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కల్యాణోత్సవాల్లో భాగంగా దర్శనాల వేళల్లో మార్పు చేసినట్టు తెలిపారు. అలాగే పలు ఆర్జిత సేవలు కూడా రద్దు చేశామన్నారు.

దర్శనాలు నిలిపివేసే సమయాలు

- ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 7 గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవు
- ఏప్రిల్ 2వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే దర్శనాలుంటాయి. తదుపరి రాత్రి 8.30 గంటల నుంచి 10గంటల వరకు దర్శనాలు లభిస్తాయి.
- ఏప్రిల్ 3వ తేదీ రాత్రి 7గంటల తర్వాత దర్శనాలు లభించవు
- ఏప్రిల్ 4వ తేదీ ఉదయం 8గంటల నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయి. ఆ రోజు స్వర్ణకవచ నారసింహ అలంకారంలో స్వామి దర్శనం లభిస్తుంది. సాయంత్రం 4గంటల నుంచి పండిత సదస్యం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి సర్వజన మనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహిస్తారు. రాత్రి 7గంటల తర్వాత దర్శనాలు లభించవు.
- ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై స్వామికి గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. రాత్రి 7గంటల తర్వాత దర్శనాలు లభించవు
- ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 6.30గంటల నుంచి పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, తిరువీధి, అవబృథోత్సవం(చక్రస్నానం), రాత్రి మృగయోత్సవం (దొంగలదోపు ఉత్సవం), ధ్వజావరోహణం నిర్వహిస్తారు. రాత్రి 7గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయి.
- ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 8గంటల నుంచి వినోదోత్సవం, 11గంటలకు మహా సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు, తదుపరి సాయంత్రం 6గంటల నుంచి దర్శనాలు లభించవు. ఆరోజు సాయంత్రం 6గంటల నుంచి శ్రీ పుష్ప యాగం, ద్వాదశారాధనలు, ఉయ్యాల సేవని నిర్వహిస్తారు.

ఆర్జిత సేవలు రద్దు

- కల్యాణోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1నుంచి 7వ తేదీ వరకు సుప్రభాతసేవ టికెట్లు, ఆరాధన సేవల టికెట్లు రద్దు చేశారు
- ఏప్రిల్ 1నుంచి 7వ తేదీ వరకు నిత్యకల్యాణంతో సహా ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు.

జీ-20 సదస్సుకు పక్కా ఏర్పాట్లు

దాబాగార్డెన్స్: విశాఖ ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న జీ-20 సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి సోమవారం ఎయిర్ పోర్టు నుంచి ఎన్‌ఏడీ, మురళీనగర్, 247 తాగునీటి ప్రాజెక్టు, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్, సిరిపురం, ఏయూ బస్‌స్టాప్, స్మార్ట్‌సిటీ వీఎంఆర్‌డీఏ పార్కు, వైఎస్సార్ వ్యూ పాయింట్(సీతకొండ), గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్, ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరానికి విచ్చేయనున్న దేశ విదేశీ ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, వచ్చిన అతిథులకు లైజనింగ్ ఆఫీసర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ అతిథులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, ముఖ్యంగా ఎయిర్ పోర్టు నుంచి ర్యాడిసన్ బ్లూ వరకు సుందరీకరణ పనులు రోడ్డు మార్గాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దామన్నారు. తెలుగుతల్లి ఫ్లైఓవర్ వద్ద పెయింటింగ్స్ అందర్నీ ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కులో పైలాన్, సాగర్‌నగర్ వ్యూ పాయింట్, గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్ వరకు సుందరీకరణాన్ని, విద్యుత్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 2,500 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దారి పొడుగునా భద్రత చర్యలు చేపట్టామని తెలిపారు.



జీ-20 పైలాన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆహార పదార్థాలతో కంపెనీలు చేసే మోసాలు అరికట్టాలి
- సన్మాన సభలో పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): సహజ సిద్ధంగా పండే చిరు ధాన్యాలు సంపూర్ణ ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. అదే సమయంలో రసాయనాలు మిళితమైన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే కంపెనీల మోసాలను అరికట్టాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో డాక్టర్ ఖాదర్‌వలీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమి సంహారక మందుల వినియోగంతో జీవవైవిధ్యానికి ముప్పు తీసుకువస్తున్నారన్నారు. పింక్ రివల్యూషన్ పేరుతో పెద్ద ఎత్తున జంతువులను పెంచి మాంసం రెడీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి కృత్రిమ ఆహార పదార్థాలు జీవన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తాయని హెచ్చరించారు. మానవ జాతికి అదృష్టం కొబ్బరి పాలు అని, ఇవి తల్లిపాలతో సమానమన్నారు. చిరుధ్యానాలు సాగుకు ఎలాంటి రసాయనిక మందులు అవసరం లేదన్నారు. దీంతో జీవ వైవిధ్యాన్ని కాపాడవచ్చునని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ డాక్టర్ ఖాదర్ వలీ చిరుధ్యానాల ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పి గొప్ప కీర్తిని పొందారని కొనియాడారు. ఈ ఏడాదిని ప్రపంచ చిరుధ్యానాల ఏడాదిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎ స్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, విజయనిర్మాణ్ అధినేత విజయకుమార్, గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం నేతలు జగలంకుమారస్వామి, ఎం.యుగంధర్‌రెడ్డి, శ్రీదేవి, గ్రీన్ క్లైమైట్ అసోసియేషన్ ప్రతినిధి జనపరెడ్డి రత్నం పాల్గొన్నారు.



డాక్టర్ ఖాదర్ వలీని సత్కరిస్తున్న ప్రముఖులు

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ముస్తాబు

ఆరిలోవ(విశాఖ తూర్పు): జీ-20 సదస్సుకు విచ్చేసే విదేశీ అతిథులను ఆకట్టుకోవడానికి ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ముస్తాబైంది. జీవీఎంసీ అధికారులు సుమారు రెండు నెలలుగా ఈ ప్లాంట్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టారు. నగరంలో మంగళవారం నుంచి జరగనున్న జీ-20 సదస్సు కోసం భారత్‌తో పాటు యూఎస్‌ఏ, యూకే, రష్యా, ఫ్రాన్స్, చైనా, కెనడా, జర్మనీ, ఇండోనేషియా తదితర దేశాల నుంచి ప్రతినిధులు ఇప్పటికే నగరానికి చేరుకున్నారు. సదస్సు అనంతరం ముడసర్లోవ రిజర్వాయరులో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను ఈ నెల 30న అతిథులు సందర్శించనున్నారు. దీంతో ఈ ప్లాంట్ వద్దకు వెళ్లే రహదారికి ఇరువైపులా పచ్చదనం, పూల మొక్కలతో తీర్చిదిద్దారు. హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాళ్‌పురం, రామకృష్ణాపురం కూడళ్లలో బీటీ రోడ్డును ఆధునికీకరించారు. నీటిలో తేలియాడే సోలార్ పలకల వద్దకు అతిథులు వెళ్లడానికి అనువుగా కొత్త హంగులతో వంతెన సిద్ధం చేశారు. విశ్రాంతి తీసుకోవడానికి ఆధునిక వసతులతో తాత్కాలికంగా టెంట్ హౌస్, మరుగుదొడ్లు నిర్మించారు. ప్రముఖులు రానుండడంతో ముడసర్లోవ ప్రాంతంలో పోలీస్ భద్రత పటిష్టం చేశారు. సోమవారం సాయంత్రం నుంచి ఈ ప్రాంతంలో పలు నిషేధ ఆంక్షలు విధించారు. ముడసర్లోవ రోడ్డులో మందుబాబులు, ఆకతాయిలు తిరగకుండా చర్యలు చేపట్టామని ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిరు. రెండు కిలోమీటర్ల పరిధిలో డ్రోన్‌లు ఎగరకుండా నిషేధం విధించామన్నారు.



ముడసర్లోవ రిజర్వాయరులో సోలార్ ప్లాంట్

నూతన కార్యాలయం ప్రారంభం

కంచరపాలెం(విశాఖ ఉత్తర): వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 గురించి ప్రతి వినియోగదారుడు తెలుసుకోవాలని న్యాయమూర్తి జి.తనూజ అన్నారు. ఐటీఐ జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వినియోగదారుల వివాదాల కేస్ ఫైల్ కార్యాలయాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదుల ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి వినియోగదారులు కేస్ ఫైల్ వేయవచ్చని తెలియజేశారు. అనంతరం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 2019 ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్‌వో జి.సూర్యప్రకాష్, డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ నందాజీ, ఉపాధ్యాయులు దొడ్డి సంజీవ కుమార్, జిల్లాలో ఉన్న వినియోగదారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న న్యాయమూర్తి తనూజ, సభ్యులు

సీజ్ చేసిన వాహనాల వేలం నేడు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు) : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) దాడుల్లో సీజ్ చేసిన వాహనాలకు మంగళవారం వేలం వేయనున్నట్టు ఎస్‌ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమవారం తెలిపారు. హెచ్‌బీ కాలనీలోని సీతమ్మధార ఎస్‌ఈబీ కార్యాలయంలో ఉన్నతాధికారుల సమక్షంలో ఉదయం 10.30 గంటలకు ఈ వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు. నాలుగు ద్విచక్ర వాహనాలను వేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని నగరవాసులు వినియోగించుకోవాలన్నారు.

లైంగిక దాడి కేసులో మేనమామపై పోక్సో కేసు

పెదగంట్యాడ: మేనకోడలిపై లైంగిక దాడికి పాల్పడిన వెంకటరమణపై న్యూపోర్టు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం రాత్రి బాలికను ఫైర్ స్టేషన్‌వెనుక ఉన్న చాకలిగెడ్డ వద్దకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తరువాత ఇంటికి తీసుకొచ్చి వదిలేశాడు. ముబావంగా ఉన్న బాలికను వెంకటరమణ సోదరులు ఎందుకు అలా ఉన్నావని అడగ్గా...జరిగిన విషయాన్ని చెప్పడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో మేనకోడలిని వెంటబెట్టుకుని వెంకటరమణ సోదరులు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన



కలెక్టరేట్‌లో నల్లబాడ్జీలు ధరించి వర్కు టూ రూల్ పాటిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మహారాణిపేట: సమస్యల సాధన కోసం రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని ఇవ్వాలని కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులూ 19 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు మాత్రమే కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఏ త్రినాథరావు, కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, నగర కార్యదర్శి రవి శంకర్, ప్రభుత్వ నాల్గో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస రావు, ప్రభుత్వ డ్రైవర్లు జిల్లా సంఘ కార్యదర్శి ప్రకాష్ ఆందోళనలో పాల్గొన్నారు.

కేంద్ర ఉక్కు కార్యదర్శికి వినతి



కేంద్ర ఉక్కుకార్యదర్శి నరేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: ముడి సరకు లేమి, ఆర్థిక సంక్షోభంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కేంద్ర ఉక్కుకార్యదర్శి నరేంద్రనాథ్ సిన్హాను కోరారు. సోమవారం ఆయనను ఢిల్లీలో కలిసిన నాయకులు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, ఐరన్ ఓర్ గనులు కేటాయింపు, క్యాపిటర్ రీస్ట్రక్చర్, బ్యాంకు రుణాల వడ్డీ రేట్లు తగ్గింపు, ఎన్‌ఎండీసీ, సెయిల్ నుంచి ఉత్పత్తి ధరకు ఐరన్ ఓర్ సరఫరాకు సహకారం తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్‌జేసీఎస్‌లో అంగీకరించిన వేతన సవరణ వెంటనే అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌కు ప్రస్తుతం రూ.3 వేల కోట్లు నష్టం ఉన్న సమయంలో వేతన సవరణ చేయడం కష్టమని పేర్కొన్నారు. ఎన్‌ఎండీసీ నుంచి రా మెటీరియల్ సరఫరా పై కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. అదే సమయంలో ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో మీరు కూడా ఆలోచించాలని కార్మిక నాయకులకు కార్యదర్శి చెప్పడం కొసమెరుపు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై. మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలకు వినతి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణకు సహకరించాలని కోరుతూ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు న్యూఢిల్లీలోని సీపీఎం ఎంపీ కరీమ్, వివిధ పార్టీల ఎంపీలు తిరుమ, వై. కుమార్‌లను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

'పది'లో శతశాతం ఫలితాలు సాధించాలి

విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతి కుమారి

సీతమ్మధార (విశాఖ ఉత్తర): పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ జ్యోతి కుమారి అన్నారు. సోమవారం పీఅండ్‌టీ స్కూల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. బైజూస్ యాప్ గురించి 8వ తరగతి విద్యార్థులతో చర్చించారు. చదువుపై పూర్తిగా దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. త్వరలోనే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పలు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారని, అంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా జగనన్న కిట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాడు-నేడు పనులు ప్రగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. రాంప్రసాద్, డైట్ లెక్చరర్ బొడ్డేటి రవి, ఉపాధ్యాయులు బెండి ప్రసాద రావు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు పాటుపడాలని డీఈవో ఎల్. చంద్రకళ అన్నారు. విశాఖ నగరంలోని గోపాలపట్నం బాలుర, బాలికల జెడ్పీపీ హైస్కూల్స్, బుచ్చిరాజుపాలెం మున్సిపల్ యూపీఎస్, అక్కిరెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. చదువుల్లో విద్యార్థుల ప్రతిభ ఎలా ఉందనేది తెలుసుకునేందుకు కొద్దిసేపు వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ షెడ్యూల్ మేరకు పాఠ్యాంశాల బోధనను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. భీమునిపట్నం ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు పర్యటనలో పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

3న ఇగ్నో వార్షిక వేడుకలు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన 36వ వార్షిక వేడుకలు నిర్వహించనున్నారు. జైల్ రోడ్డు దరి విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వివిధ కోర్సుల్లో డిగ్రీలు పొందిన వారికి పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలియజేశారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం (విజయనగరం) వీసీ ఆచార్య టీవీ కట్టిమణి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థుల వివరాలు అందజేయండి

విశాఖ విద్య: జాతీయ ప్రతిభాన్వేషణ(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందజేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్ సూచించారు. విద్యార్థుల కుల, ఆదాయ, 7వ తరగతి మార్కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, హాల్ టికెట్, దివ్యాంగ విద్యార్థులు ఉన్నట్లయితే, ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులను ఈ నెల 29 నాటికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. తుది జాబితా విడుదల చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఎటువంటి అభ్యర్థనలను తీసుకోవటం జరగదన్నారు. ఈ విషయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకొని, సకాలంలో ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు.

కుక్క దాడిలో 10 మందికి గాయాలు

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో మూడు రోజులుగా కుక్క దాడి చేసి 11 మందిని గాయపరిచింది. గెద్ద జానకీదేవి, తాళ్లపూడి కృష్ణ, పిన్నింటి రమణ, బాలుడు కల్లిపిల్లి హర్షవర్ధన్, గెద్ద రాజు, గెద్ద కొండమ్మ గాయపడ్డారు. వీరిలో పిన్నింటి రమణ విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చివరకు కుక్కను గ్రామస్తులు సోమవారం మట్టుబెట్టారు.



గాయపడిన కృష్ణ